క్లుప్తంగా

వ్యాధి నిరోధక శక్తి పెంపొందించుకోవాలి

సైదాపురం: గర్భిణులు, బాలింతలు వ్యాధినిరోధక శక్తి పెంపొందించుకోవాలని రాపూరు సీడీపీఓ సునంద పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం అంగన్‌వాడీ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ 0–5 ఏళ్ల ఉన్న పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు. పిల్లల ఆరోగ్య విషయాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

విద్యా సామగ్రి పంపిణీ

చిల్లకూరు: గూడూరు మండలం విందూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం 45 మంది విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. పదవ తరగతి విద్యార్థులకు అవసరమైన పరీక్ష ప్యాడ్లు, స్టడీ చైర్‌లు అందించారు.

పండ్ల తోటలపై దృష్టి


రైతులతో మాట్లాడుతున్న గాయత్రి

రాపూరు: రైతులు పండ్ల తోటలపై దృష్టి సారించాలని ఉపాధి హామీ పథకం ఏపీడీ గాయత్రి పిలుపునిచ్చారు. మండలంలోని వీరాయిపాళెంలో బుధవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఉపాధి పథకం ద్వారా పండ్ల తోటల పెంపకం చేపట్టినట్లు తెలిపారు. పండ్ల తోటలకు ఉపాధి హామీ పథకం ద్వారా హెక్టారుకు మొక్కలు పెంచేందుకు రూ.50 వేలు అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీఓ చంద్రయ్య, రైతులు పాల్గొన్నారు.

గర్భిణుల వివరాలు నమోదు చేయండి

వెంకటగిరి రూరల్: గర్భిణుల వివరాలను సేకరించి నమోదు చేయాలని సీడీపీఓ శంషాద్‌బేగం అంగన్‌వాడీ కార్యకర్తలను ఆదేశించారు. పట్టణంలోని సీడీపీఓ కార్యాలయంలో బుధవారం అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పీఎంఎంవీవై పథకం ద్వారా గర్భిణులకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. వారికి సంబంధించి వివరాలను రికార్డుల్లో పొందుపరచాలన్నారు.

రైతు సమస్యలపై దృష్టి పెట్టండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

సూళ్లూరుపేట రూరల్ : రైతులకు ఎంటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎంపీపీ అల్లూరు అనిల్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక మండల కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంబంధిత అధికారులు రైతుల సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని, గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి, ఎంపీడీఓ మురళి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

కోట: చిట్టేడులో రాజరాజేశ్వరి అమ్మవారి ప్రాంగణంలో రాజరాజేశ్వరి ఆలయ నిర్మాణానికి నాగశక్తి పీఠాధిపతి చిదానంద స్వామి భూమిపూజ చేశారు. చిదానందస్వామి మాట్లాడుతూ అమ్మవారి అనుగ్రహంతో ఇక్కడ రాజరాజేశ్వరి దేవస్థానం నిర్మాణం సవ్యంగా సాగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు రాజారత్నం, సుధాకర్, రమణయ్య, మోహన్ , శ్రీరాంసురేష్ పాల్గొన్నారు.

పరిశుభ్రత అవసరం


మ్యాప్‌ను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ జాలిరెడ్డి

ఓజిలి: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తసంపద కేంద్రాలను ఉపయోగించుకోవాలని డీఎల్‌డీఓ జాలిరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పున్నేపల్లి గ్రామంలో చెత్తసంపద కేంద్రం ద్వారా చెత్త తరలింపు ప్రక్రియను ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం స్వామిత్వ గ్రామ పంచాయతీ మ్యాప్‌ను పరిశీలించి సూచనలు చేశారు. ఈయన వెంట ఎంపీడీఓ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు ప్రసన్న, ప్రవెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

చికెన్ ధరలు		21-8-2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	113
లేయర్ లైవ్	:	118
బ్రాయిలర్ చికెన్	:	210
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	234
లేయర్ చికెన్	:	200

కోలుకోని దెబ్బ


మంచానికి పరిమితమైన శంకరయ్య

ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు ఎడివర్ల శంకరయ్య. పెళ్లకూరు మండలం, ఎగువతాగేలి దళితకాలనీకి చెందిన ఈయన 2016లో పక్షవాతంతో మంచం పట్టాడు. సదరం వైద్య క్యాంపులో సర్టిఫికెట్ పొంది గత ప్రభుత్వంలో రూ.5 వేలు పింఛన్ తీసుకొని జీవనం సాగించేవాడు. కూటమి ప్రభుత్వంలో మరోమారు సదరం క్యాంపులో వైద్య పరీక్షలు చేసి 90శాతం వైకల్యం ఉండడంతో రూ.15వేలు పింఛన్ మంజూరు చేశారు. అయితే కూటమి ప్రభుత్వంలో మంజూరు చేసిన అధికారులే రీ వెరిఫికేషన్ పేరుతో ఇప్పుడు పూర్తిగా పింఛన్ రద్దు చేయడంతో దిక్కుతోచక అల్లాడుతున్నాడు.

– పెళ్లకూరు

రాపూరు ఎంపీడీఓ భవానీకి వినతి పత్రం అందిస్తున్న బాధితులు


- కక్ష కట్టి పింఛన్ ఎగ్గొట్టిన ప్రభుత్వం
- వారి మెడకు అనర్హత బోర్డు తగిలించిన యంత్రాంగం

దివ్యాంగులపై చిన్నచూపు

రాపూరు/దక్కిలి: కూటమి ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోంది. దివ్యాంగుల పొట్టకొడుతోంది. వారి మెడలో అనర్హత బోర్డు తగిలించి పింఛన్ తొలగించేందుకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే రీవెరిఫికేషన్ పూర్తి కావడంతో ఇందులో 40 శాతంలోపు వైకల్యం ఉన్నవారికి పింఛన్ తొలగిస్తున్నట్లు నోటీసులు జారీ చేసింది. ఫలితంగా మండలంలోని అన్ని గ్రామాల నుంచి దివ్యాంగులు తమ పింఛన్లు తొలగించారంటూ మండల పరిషత్ కార్యాలయం, సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. రాపూరు మండలంలో 92 మందికి నోటీసులు జారీ చేసి పింఛన్లు ఎగ్గొట్టింది. వీరిలో నడవలేనివారు పని చేసుకోలేని ఎంతో మంది ఉన్నారు. దక్కిలి మండలంలో 63 దివ్యాంగ పింఛన్లు తొలగిస్తూ నోటీసులు జారీ చేసింది. 18 పింఛన్లు దివ్యాంగుల నుంచి వృద్ధాప్యానికి మార్చేస్తూ ఆమోదించింది.

నాకు కళ్లు కనిపించవు



నాకు ఒక కన్ను కనిపించదు. మరో కన్ను మంటగా ఉంటుంది. చూపు సరిగా కనిపించదు. 2016లో రూ.200 నుంచి పింఛన్ తీసుకుంటున్నాను. వైకల్యం 40 శాతం లోపం ఉందని పింఛన్ తొలగిస్తున్నట్లు నోటీసులు అందించారు. పింఛన్ మీదే ఆధారపడి జీవిస్తున్నాను.న్యాయం చేయాలని ఎంపీడీఓను అభ్యర్థించాను.

- మంగమ్మ, మల్లమ్మగుంట, రాపూరు

ఒక చెయ్యి పనిచేయదు



నాకు చిన్న తనం నుంచే ఒక చెయ్యి కిందకు రాదు. ఒక చెయ్యి మాత్రమే పనిచేస్తుంది. నాకు రూ.6,000 పింఛన్ వచ్చేది. భర్త మరణించడంతో నేను దివ్యాంగుల పింఛన్ తీసుకుంటున్నాను అంటూ ఇక్కడ కొందరు అక్కసు వెళ్లగక్కుతున్నారు. ఏదో ఒక సాకు చూపి ఇప్పుడు ఆ పింఛన్ రాకుండా చేసి నా పొట్టగొట్టారు.

- కుంచం కిష్టమ్మ, రాపూరు

5 శాతం తగ్గించేశారు



నాకు రెండు కాళ్లు చచ్చుబడి పోవడంతో దివ్యాంగుల పరీక్షకు ఆరేళ్ల కిందట వెళ్లగా 45 శాతం వైకల్యం సర్టిఫికెట్ డాక్టర్లు మంజూరు చేశారు. అయితే ఇటీవల మళ్లీ పరీక్ష పేరుతో ఆస్పత్రికి వెళ్లగా 5 శాతం తగ్గించి 40 శాతం లోపలే వైకల్యం ఉన్నట్లు ధ్రువీకరించారు. దీంతో నేను పింఛన్ కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా.

- చింతమాను పెంచలయ్య, డి.వడ్డిపల్లి

కాలు చచ్చుబడిపోయింది



నాకు చిన్న తనంలో కాలు చచ్చుపడిపోవడంతో ఒక కాలు పనిచేయదు. 2005 నుంచి పింఛన్ తీసుకుంటున్నాను. ఇప్పుడు 40శాతం లోపు వైకల్యం ఉందంటూ పింఛన్ తొలగిస్తూ నోటీసులు అందించారు. కూటమి ప్రభుత్వం కక్ష కట్టడం ఎంత అన్యాయం. అధికారులు స్పందించి నాపై దయ చూపించి పింఛన్ ఇవ్వాలి.

- శోభన్‌బాబు, గోనుపల్లి, రాపూరు మండలం

పూట గడవడమే కష్టం



నాకు ఒక చెయ్యి పూర్తిగా పని చేయకపోవడం వల్ల కూలీ పనులకు కూడా వెళ్లలేను. గతంలో నాకు వైద్యులు పరీక్షలు చేసి 59 శాతం వైకల్యం ఉన్నట్లు ధృవీకరించారు. కానీ ఇప్పుడు నా పింఛన్ తొలగిస్తూ నోటీసు జారీ చేశారు. దీంతో నాకు పూటగడవడమే కష్టంగా మారింది. ప్రభుత్వం మాలాంటి వారిపై కక్ష కట్టడం అన్యాయం.

- వేముల జయరామయ్య, దేవునివెల్లంపల్లి, దక్కిలి

కలిమిలికి భూమన పరామర్శ


కలిమిలి రాంప్రసాద్‌రెడ్డిని పరామర్శిస్తున్న భూమన కరుణాకరరెడ్డి

వెంకటగిరి రూరల్: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కలిమిలి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి, దక్కిలి మండల జెడ్పీటీసీ సభ్యులు కలిమిలి రాజేశ్వరి ఈనెల 7న మృతి చెందారు. ఈ క్రమంలో ఆ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి బుధవారం పట్టణంలోని కలిమిలి నివాసం వద్దకు చేరుకుని పరామర్శించారు. తొలుత రాజేశ్వరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలిమిలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పోలేరమ్మతల్లి జాతరకు పటిష్ట బందోబస్తు


జాతర ప్రదేశాలను పరిశీలిస్తున్న డీఎస్పీ గీతా కుమారి

వెంకటగిరి రూరల్: వెంకటగిరిలో వచ్చే నెలలో నిర్వహించనున్న పోలేరమ్మతల్లి జాతరకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు గూడూరు డీఎస్పీ గీతాకుమారి పేర్కొన్నారు. ఆమె బుధవారం పట్టణంలోని పోలేరమ్మతల్లిని దర్శించుకున్నారు. అనంతరం జాతర జరుగు ప్రాంతాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ జాతరకు 2 లక్షల మందికి పైగా భక్తులు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. జాతరలో భక్తుల సౌకర్యార్థం, క్యూలు, వాహనాలు పార్కింగ్ వంటిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 27వ తేదీన వినాయక చవితి పండుగను పురస్కరించుకుని నిర్వాహకులు ముందస్తుగా పోలీసు అనుమతి తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ ఏవీ రమణ, ఎస్‌ఐ ఏడుకొండలు పాల్గొన్నారు.

వరగలి పాఠశాలలో కెమిస్ట్రీ ల్యాబ్

చిల్లకూరు: విద్యార్థుల మేధోశక్తిని పెంపొందించేందుకు అవసరమైన ల్యాబ్‌లను ఏర్పాటు చేసేందుకు పీఎంశ్రీ (ప్రధాన మంత్రి స్కూల్స్ రైజింగ్ ఇండియా) చర్యలు చేపట్టినట్లు సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ గౌరీ శంకర్ తెలిపారు. ఆయన బుధవారం మండలంలోని వరగలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పర్యటించి కెమిస్ట్రీ ల్యాబ్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో చదివే విద్యార్థులకు సైన్సుపై మక్కువ కల్పించి కొత్త ప్రయోగాలకు నాంది పలికేలా చూస్తామని అన్నారు. ఆయన వెంట సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి శివశంకర్, ఎంఈఓ –2 రవూఫ్, సమగ్ర శిక్ష ఏఈ చరణ్‌సింగ్, పాఠశాల హెచ్‌ఎం మరుద్వతి పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని దుకాణాలపై చర్యలు


మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ విజయ శేఖర్

నాయుడుపేటటౌన్: ప్రభుత్వ నిబంధనలు అమలు చేయని మద్యం దుకాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ డిప్యూటీ కమిషనర్ విజయ శేఖర్ హెచ్చరించారు. పట్టణంలోని ఆశాఖ సీఐ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం తిరుపతి జిల్లా వ్యాప్తంగా మద్యం బార్లకు కొత్తగా లైసెన్స్‌ల జారీకి చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఆసక్తి ఉన్నవారు ఎక్సైజ్ కార్యాలయాల్లో అధికారులను సంప్రదించి పూర్తి వివరాలను తెలుసుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో డీపీఓ నాగమల్లేశ్వరరావు, సీఐ అరుణ కుమారి పాల్గొన్నారు.

నాలుగు చెరువుల ఎంపిక

కోట: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆర్‌ఆర్‌ఆర్ పథకం ద్వారా మండలంలో నాలుగు చెరువులు అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు పంపినట్లు ఇరిగేషన్ ఏఈ మునిరత్నం బుధవారం తెలిపారు. కొత్తపాళెం పెన్నక్కచెరువు, కొత్తపట్నం ఉయ్యాలమ్మ చెరువు, ఉత్తమనెల్లూరు, కొక్కుపాడు చెరువులను ఎంపిక చేసినట్లు చెప్పారు. ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా సర్వేబృందం చెరువులను పరిశీలించి సర్వే చేపట్టినట్లు పేర్కొన్నారు.

ఆలయ భూముల కౌలుకు వేలం

వాకాడు: వాకాడు మండలంలోని జువ్వినట్టు గ్రామంలో వెలసిన శ్రీ అన్నపూర్ణాదేవి సమేత శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ భూములకు బుధవారం ఎండోమెంటు అధికారులు కౌలు వేలం పాటలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త తిరుమూరు సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంపాటలో ఆలయానికి సంబంధించిన 98 ఎకరాల భూములను రైతులు పాల్గొని రూ.25 లక్షలకు పాడుకున్నట్లు తెలిపారు.

చవితి వేడుకలకు అనుమతి తప్పనిసరి

బాలాయపల్లి(సైదాపురం): మండలంలోని వినాయక ఉత్సవాల్లో భాగంగా విగ్రహాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఎస్‌ఐ గోపి తెలిపారు. వినాయక ఉత్సవాల కమిటీల నిర్వాహకులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాల్లో విగ్రహాలు ఏర్పాటు చేసేవారు పోలీసు విద్యుత్‌శాఖ అనుమతులు తీసుకోవాలని స్పష్టం చేశారు.

అనుమతులు తప్పక తీసుకోవాలి

నాయుడుపేటటౌన్ : వినాయక చవితి వేడుకల నిర్వాహకులు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని అర్బన్ సీఐ బాబి సూచించారు. విగ్రహాలతో పాటు మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు సింగిల్ విండో విధానం ద్వారా అనుమతులు పొందాలన్నారు. అనుమతులు పొందుకునేందుకు ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. మండపాల వద్ద నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాపూరుకు నేడు సజ్జల రాక

రాపూరు: ఉమ్మడి నెల్లూరు జిల్లా ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తండ్రి ఆనందరావు ఇటీవల మృతి చెందడంతో మేరిగ మురళీధర్‌ను పరామర్శించేందుకు రాపూరులోని ఆయన గృహానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి గురువారం రానున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బొద్దు మధుసూదన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

వేగవంతంగా ఈ పంట నమోదు

సైదాపురం: మండలంలో సాగులో ఉన్న పంటలన్నింటినీ ఈ–క్రాప్‌లో వేగవంతంగా నమోదు చేయాలని మండల వ్యవసాయాధికారి హైమావతి కోరారు. మండలంలోని రామసాగరం, లింగసముద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులు వరిసాగులో విత్తనాభివృద్ధి చేయడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చన్నారు.

తొలగించిన పింఛన్లు పునరుద్ధరించాలి

చిల్లకూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తొలగించిన పింఛన్లను పునరుద్ధరించాలని సీపీఐ నేత శశికుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్‌లో బుధవారం వారు నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ, తిరుపతి జిల్లాలో తొలగించిన సుమారు 33 వేల దివ్యాంగ పింఛన్లను వెంటనే పునరుద్ధరించాలని అన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

చిట్టమూరు: అర్హులందరికీ దివ్యాంగ పింఛన్ అందించనున్నట్లు ఎంపీడీఓ మనోహర్ గౌడ్ పేర్కొన్నారు. ఆయన బుధవారం సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. మండలంలో 190 మంది పింఛన్ల తొలగింపునకు నోటీసులు అందజేసినట్లు తెలిపారు. అయితే నోటీసులు అందిన వారు అర్హులై ఉంటే వారు మళ్లీ సదరం క్యాంపుకెళ్లి వైకల్య ధ్రువీకరణ పత్రం తీసుకుని కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

చెరువు కట్టపై కలప లూటీ


ట్రాక్టర్‌కు లోడ్ చేసిన వేప దుంగలు

చిట్టమూరు:మండల పరిధిలోని ఈశ్వరవాక చెరువు కట్టపై దట్టంగా పెరిగిన వేప చెట్లను మండలంలోని ఓ కూటమి నేత అక్రమంగా నరికేసి కలప దోపిడీకి పాల్పడుతున్నారు. ఇదేమని అడిగిన పంచాయతీ సర్పంచ్, వైస్ ఎంపీపీలపై బెదిరింపులకు దిగుతున్నట్లు ప్రజాప్రతినిధులు వాపోతున్నారు. ఈ విషయంపై పోలీసులు, మండల పరిషత్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువుకట్టపై ఉన్న వేప చెట్లను వేలంపాట నిర్వహించి వచ్చిన ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి ఖర్చు చేయాలని సర్పంచ్ అటవీ అధికారుల చేత ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అటవీ శాఖ అధికారులు వృక్ష సంపదను లెక్కగట్టి రూ.2.76 లక్షలు చేస్తాయని ప్రతిపాదించారు. ఈలోపు కూటమి నేత చెరువు కట్టపై ఉన్న వేప చెట్లను అక్రమంగా నరికి వేయించి ట్రాక్టర్ల ద్వారా నాయుడుపేటకు తరలించి వచ్చిన నగదును తన జేబులో వేసుకున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి పంచాయతీకు రావాల్సిన ఆదాయాన్ని కూటమి నేతల జేబులోకి కాకుండా పంచాయతీ అభివృద్ధికి ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉపాధిలో ఉద్యాన పంటల సాగు

సైదాపురం: ఉపాధి పథకం ద్వారా ఉద్యాన పంటల సాగు చేపట్టేందుకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందని ఏపీఓ సురేంద్ర తెలిపారు. మండల కేంద్రంలో ఎంపీడీఓ రవీంద్రబాబు ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షించారు. మండలానికి 350 ఎకరాల్లో నిమ్మ తోటలు పెంచుకునేందుకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందన్నారు.

నేడు ఉచిత క్యాన్సర్ పరీక్షలు

బాలాయపల్లి (సైదాపురం): బాలాయపల్లిలోని పీహెచ్‌సీలో పింక్ బస్సుల ద్వారా గురువారం రోగులకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్యాధికారి వెంకటరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ స్విమ్స్ ఆధ్వర్యంలో ఈ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నట్లు చెప్పారు.

భూ సమస్యపై రెవెన్యూ కోర్టు

చిట్టమూరు: మండల పరిధిలోని భూ సమస్యలను ఇరు వర్గాలు రెవెన్యూ కోర్టు ద్వారా సమస్యలను పరిష్కరించుకోవచ్చని తహసీల్దార్ కాయల సతీష్ కుమార్ తెలిపారు. రెవెన్యూ కార్యాలయంలో బుధవారం యాకసిరి పంచాయతీ పాటిమిట్ట గ్రామానికి చెందిన రైతులు తమ పొలానికి సంబంధించిన భూ సమస్యపై రెవెన్యూ కోర్టు నిర్వహించారు.

దోమల నియంత్రణపై అవగాహన

సైదాపురం/రాపూరు/ఓజిలి/కలువాయి: ప్రపంచ దోమల నియంత్రణ దినోత్సవం సందర్భంగా ఆరోగ్య సిబ్బంది ఆయా మండల కేంద్రాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు దోమల ద్వారా వచ్చే వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు.


రాపూరు: ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

కండలేరులో 29.458 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 29.458 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 7,640 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,700, పిన్నేరు కాలువకు 30, లోలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా..



కలువాయి(సైదాపురం): మండలంలోని చీపి నాపి నుంచి చింతలాత్మకూరుకు వచ్చే మార్గంలో మలుపువద్ద ట్రాక్టర్ బోల్తాపడిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఆత్మకూరు నుంచి నిమ్మ చెట్లకు ఎరువు తీసుకెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడడంతో డ్రైవర్ అక్కడి నుంచి పారిపోయాడు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న బైక్

నాయుడుపేటటౌన్ : ట్రాక్టర్‌ను బైక్ ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు, మేనకూరుకు చెందిన శరవణ, సాయి బుధవారం మోటార్ బైక్‌పై వెళుతుండగా, పట్టణ పరిధిలోని స్వర్ణముఖి కాజ్‌వే వద్ద బుధవారం సాయంత్రం ట్రాక్టర్‌ను మోటార్ బైక్ వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ప్రభుత్వ వైద్యశాలకు వద్దకు వెళ్లి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ కేసులపైనే సర్కారు దృష్టి


ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌తో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చిల్లకూరు: ఆధారాలు చూపలేని కేసులను వైఎస్సార్ సీపీ నాయకులపై మోపి వారిని అరెస్టు చేయడమే కూటమి ప్రభుత్వం పనిగా పెట్టుకుందని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ విమర్శించారు. మాజీ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి బుధవారం రిమాండ్ నుంచి విడుదలైన తరువాత నెల్లూరులో ఆయన్ను కలుసుకుని సంఘీభావం తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పాలన చేపట్టలేక వారు చేసే అక్రమాలను ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయించి వారిని జైలుకు పంపుతున్నారని చెప్పారు. అయితే అక్రమ కేసులు బనాయించిన వారిపై కోర్టుకు ఆధారాలు సమర్పించలేక నవ్వుల పాలవుతున్నారని అన్నారు. ప్రతి జిల్లాలో తమ ప్రతాపం చూపించేలా రౌడీయిజం చెలాయిస్తున్నారని అన్నారు. మొన్న పులివెందుల్లో జరిగిన జెడ్పీటీసీ ఉప ఎన్నికలను రాజ్యాంగ విరుద్ధంగా నిర్వహించినా ఎన్నికల కమిషన్ చేష్టలుడిగి చూస్తోందని చెప్పారు. గూడూరు నియోజకవర్గంలో రౌడీల రాజ్యం కొనసాగుతోందని చెప్పారు. దీనికి పోలీసు యంత్రాంగంతో పాటుగా అధికార పార్టీ నేతలు తోడ్పాటు అందించడం సిగ్గుచేటన్నారు. అనంతరం సూళ్లూరుపేట నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు మేరిగ మురళీధర్‌ను పరామర్శించి ఇటీవల మృతి చెందిన వారి తండ్రి ఆనందరావు ఆత్మకు శాంతి కలగాలని కోరారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, విజయ సార్థరెడ్డి, వెంకటక్రిష్ణయ్య, గూడూరు పట్టణ, చిట్టమూరు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు బొమ్మిడి శ్రీనివాసులు, సన్నారెడ్డి శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

కాకాణిని కలిసిన సన్నారెడ్డి

చిట్టమూరు: వైఎస్సార్ సీపీ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని చిట్టమూరు మండల ఆ పార్టీ మండల కన్వీనర్ సన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి కలసి పుష్పగుచ్ఛం అందజేశారు.